

పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

పంచాయతీల్లో ఇకపై డిజిటల్ విధానంలో మాత్రమే పనులు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. - 8లో



జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చినట్లు టెక్నికల్ ఈఈ సుబ్బారావు తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	25
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	38	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల సాధారణం గా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,728 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,084 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.24 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

14న జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కిల్ ఇండియా– మేకిన్ ఇండియాలో భాగంగా ఈ నెల14వ తేదీన ఉదయం 10 గంటలకు తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ మేళాకు జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు అంప్రెటీస్‌షిప్ కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 94416 47174, 96764 86678 నంబర్లలో గంగాధరం, అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



గురుదక్షిణామూర్తి సన్నిధిలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీల ద్వారా మొత్తం రూ.1,28,91,813 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సాగర్‌బాబు తెలిపారు. అలాగే 140 గ్రాముల బంగారం, 412.6 కేజీల వెండి, 61 నోట్ల విదేశీ కరెన్సీ వచ్చినట్లు వివరించారు. జూలై 13వ తేదీ నుంచి హుండీల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

తిరుమలలో జెర్రిపోతు కలకలం



పట్టుకున్న పాముతో భాస్కర్‌నాయుడు

తిరుమల : తిరుమలలోని సేవాసదన్ వద్ద బుధవారం 6 అడుగుల జెర్రిపోతు కలకలం సృష్టించింది. దీనిపై సమాచారం అందుకున్న టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు వెంటనే అక్కడకు చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకుని అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

విజయవంతంగా 'సురక్ష'

4,56,053 ధ్రువీకరణ పత్రాల పంపిణీ




వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్ : జిల్లాలో జగనన్న సురక్షను విజయవంతం చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందని కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేశామని వెల్లడించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 481 గ్రామ సచివాలయాలు, 210 వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, అధికారులు, సిబ్బంది సమష్టిగా 6,43,863 గృహాలను (90.42శాతం) సందర్శించారన్నారు. జగనన్న సురక్షలో సూచించిన 11 రకాల సేవలకు ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా ఉచితంగా 4,56,053 మందికి అవసరమైన సర్టిఫికెట్లు అందజేసినట్లు వెల్లడించారు. అర్హతలేని కారణంగా 4,325 దరఖాస్తులు తిరస్కరించామని, ఆయా వివరాలను దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా తెలియజేశామన్నారు. మరో 8,961 అభ్యర్థనలు పరిశీలన దశలో ఉన్నట్లు వివరించారు.

9న కపిలేశ్వరాలయంలో ఆడికృత్తిక

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన ఆడికృత్తిక వేడుకలు వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం అభిషేకం చేస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు తిరువీధి ఉత్సవం చేపడతారు.

ప్రగతి పరుగులు



శ్రీసిటీలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. రెండో విడత విస్తరణ పనులు వేగవంతం కావడంతో మరింతగా అభివృద్ధి చెందనుంది. ఇప్పటికే ప్రభుత్వం పలు పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించింది. అందులో కొన్ని కంపెనీల నిర్మాణం సైతం ప్రారంభమైంది. తొలి దశ సెజ్‌కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. మలి దశలకు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారు. ఇద్దరు నేతల సంకల్ప బలంతో వెనకబడిన ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. గ్రామీణుల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయి. రెండో విడత పనులు పూర్తయితే యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

వరదయ్యపాళెం : ప్రముఖ పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీలో రెండవ విడత పనులు ఊపందుకున్నాయి. పెద్ద సంఖ్యలో పరిశ్రమల ఏర్పాటు దిశగా రోడ్లు, మౌలిక వసతుల కల్పన, నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు నిర్మాణ పనులను మొదలు పెట్టాయి. మరికొన్ని పరిశ్రమలకు స్థలాల కేటాయింపులు పూర్తయ్యాయి. రెండో దశ పనులు ప్రారంభం కావడంతో ఆ ప్రాంత గ్రామాల రూపురేఖలు సైతం మారనున్నాయి.



శ్రీసిటీ రెండవ దశ పారిశ్రామికవాడలో ఏర్పాటు కానున్న సీఆర్‌ఆర్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

2,200 ఎకరాల్లో పనులు

సత్యవేడు మండలం ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం, వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామ పంచాయతీల పరిధిలోని 2,200 ఎకరాల్లో శ్రీసిటీని విస్తరించనున్నారు. ఈ మేరకు రెండో దశలో పరిశ్రమలు ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. ఇరుగుళం సమీపంలో పెద్దఈటిపాకం, కొల్లడం గ్రామాల మధ్య పారిశ్రామికవాడకు సంబంధించిన మౌలిక వసతులను శరవేగంగా కల్పిస్తున్నారు.

నిర్మాణ దశలో పలు పరిశ్రమలు

శ్రీసిటీ పరిధిలోని రెండో దశ పారిశ్రామికవాడలో ఓజీ ఇండియా ప్యాకింగ్, చైనాకు చెందిన సీఆర్ఆర్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. మరికొన్ని పరిశ్రమలకు ఎంఓయూ సైతం పూర్తయ్యాయి. పక్కాగా మౌలిక వసతులు, ట్రాన్స్‌పోర్టుతోపాటు ప్రభుత్వం ప్రోత్సాహం ఉండడంతో శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు.

తొలి దశకు వైఎస్సార్



అప్పట్లో శ్రీసిటీలో మొదటి దశ పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బీజం వేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో పారిశ్రామికవాడకు పురుడు పోశారు. సుమారు 8వేల ఎకరాల్లో 08.08.2008వ తేదీన తొలుత 8 పరిశ్రమలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పునాదిరాయి వేశారు. అప్పటి నుంచి దినదినాభివృద్ధి చెందిన శ్రీసిటీ అంతర్జాతీయ స్థాయికి చేరింది. 15ఏళ్లలో రూ. 45వేల కోట్లకు పైగా పెట్టుబడులతో 28 దేశాలకు చెందిన 200 పరిశ్రమలకు నిలయంగా మారింది. దాదాపు 50వేలకు పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందించింది. దేశంలోనిఅత్యున్నత పారిశ్రామికవాడలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

మలి దశకు సీఎం వైఎస్ జగన్



శ్రీసిటీ పారిశ్రామిక వాడలోని రెండో దశకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పరిశ్రమ ఏర్పాటు సంబంధించిన అనుమతులకు పూర్తిగా సహకారం అందిస్తున్నారు. శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతుండడంతో భూములు అందించిన ఇరుగుళం, పెద్దఈటిపాకం, కొల్లడం, తొండూరు పంచాయతీల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



శ్రీసిటీ రెండవ దశ పారిశ్రామికవాడలో నూతనంగా నిర్మించిన రోడ్లు



నిర్మాణ దశలో ఓజీ ఇండియా ప్యాకేజింగ్ పరిశ్రమ



నూతనంగా ఏర్పాటు చేసిన కాంక్రీటు మిక్సింగ్ ప్లాంట్



పారిశ్రామికవాడలో నిర్మాణ దశలోని పరిశ్రమలు

7న వైద్యులకు వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్



ప్రిన్సిపల్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా : తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల నియామకానికి వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విభాగాల వారీ ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను రిక్రూట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా మొత్తం 67 క్లినికల్, నాన్ క్లినికల్, సూపర్ స్పెషాలిటీ వైద్యుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సీనియర్ రెసిడెంట్‌లుగా చేరేందుకు ఆసక్తి కలిగిన వైద్యులు ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చాంబర్లో హాజరు కావాలన్నారు. ఆసక్తిగల వారు విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ లతో పాటు జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. వివరాలకు http:// www. svmctpt. edu.in వెబ్‌సైట్, 9246991845 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముక్కంటిసేవలో యూఎస్ కౌన్సిల్ జనరల్



జెన్నీఫర్ లార్సన్‌కు జ్ఞాపిక అందిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం యూఎస్ కౌన్సిల్ జనరల్ ఇన్ హైదరాబాద్ జెన్నీఫర్ లార్సెన్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద బియ్యపు పవిత్రారెడ్డి, అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తమిళ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

నగరి: విద్యార్థులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కేరోజా అన్నారు. స్థానిక చింతలపట్టెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తమిళ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. కార్పొరేట్ స్థాయికి మారిన ప్రభుత్వ పాఠశాలలే అందుకు సాక్ష్యమని చెప్పారు. విద్యకు సంబంధిత ప్రతి అంశంపైనా ముఖ్యమంత్రి అత్యంత వేగంగా స్పందిస్తారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న విద్యార్థులకు తమిళపాఠ్యపుస్తకాలు అందించే విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రులు కూడా తనకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. తమిళ మాధ్యమం కలిగిన పిల్లలకు తమిళనాడు నుంచి తెప్పించిన పాఠ్య పుస్తకాలను అందజేశారు. నియోజకవర్గంలోని సెంగుంధర్ ఇంటి కోడలినని వారిపట్ల తనకు ప్రత్యేక అభిమానము ఉందని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో తమిళ విద్యార్థులకు పుస్తకాలు అందేవి కావని వారు సీడీలు మాత్రమే ఇచ్చేవారని వాటిని తెచ్చి ఇక్కడ ముద్రించుకొని విద్యార్థులకు అందించేలోపు పుణ్యకాలం గడిచిపోయేదని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ఆ సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తమిళ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న మంత్రి రోజా

14న యాదవ ఆత్మీయ సభ



మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

పుంగనూరు: యాదవ ఆత్మీయ సభను ఈనెల 14న నిర్వహించనున్నట్లు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీకృష్ణాలయం వద్ద మంత్రికి యాదవ సంఘ నాయకులు వెంకటరెడ్డి యాదవ్, సుబ్రమణ్య యాదవ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే బీసీలకు ప్రాధాన్యత లభించిందన్నారు. ముఖ్యంగా యాదవులకు తగిన గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నామని స్పష్టం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి యాదవులకు అగ్రస్థానం కల్పించారని కొనియాడారు. అందుకే యాదవ ఆత్మీయ సభను పుంగనూరులో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీకృష్ణాలయానికి మంత్రి రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. ఎంపీలు బీదమస్తాన్‌రావు ద్వారా రూ.10 లక్షలు, కృష్ణయ్య ద్వారా రూ.5 లక్షలు విరాళం ఇప్పిస్తున్నట్లు తెలిపారు.నరసింహ యాదవ్, నరసింహులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం ముక్కంటి ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 8న భరణి, 9న ఆడికృత్తిక, 10వ తేదీ తెప్పోత్సవం, 11న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాలను అధికారులు, పాలకమండలి సభ్యులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, సాధన మున్నా, పెద్దిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, సుమతి, ప్రత్యేక ఆహ్వానితుడు జూలుగంటి సుబ్బారావు, పాండు పాల్గొన్నారు.

ప్రజారంజకంగా పరిపాలన

- జగనన్న వెంటే జనం
- ఓర్వలేకే చంద్రబాబు విషప్రచారం
- సంక్షేమ పథకాలతో మళ్లీ విజయం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ప్రజారంజకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. బుధవారం తిరుపతి 19వ డివిజన్ ఎమ్మార్‌పల్లె న్యూబాలాజీ కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను అందిపుచ్చుకుని సీఎం వైఎస్ జగన్ దేశం మెచ్చేలా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు చేయలేని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారని వివరించారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక చంద్రబాబు విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 95శాతం అమలు చేశామని, అయినప్పటికీ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి ఎల్లో మీడియా అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఎవరెన్ని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, సంక్షేమ పథకాలే తిరుగులేని విజయాన్ని అందిస్తాయని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన భూస్థాపితం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఆరణి సంధ్య పాల్గొన్నారు.



కిడ్నీ వ్యాధిగ్రస్తుడు బాలకృష్ణయ్యకు రూ.10వేల పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, చిత్రంలో మేయర్ శిరీష తదితరులు

> **ప్రాణం నిలబెడుతున్న రూ.10వేలు**
>
> ఇల్లు గడవడమే కష్టంగా ఉంటే కిడ్నీ వ్యాధికి గురయ్యా. చికిత్స చేయించుకోలేని దుస్థితి. అయితే కిడ్నీ బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న రూ.10వేల పింఛన్ నా ప్రాణాన్ని నిలబెడుతోంది. డయాలసిస్ చేయించుకోవడంతోపాటు కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ మా ఇంటికి వచ్చి మరీ పింఛన్ నగదు అందిస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వం ఉంటే మాలాంటి పేదలు ధైర్యంగా జీవనం సాగిస్తారు.
>
> – బాలకృష్ణయ్య, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

యజ్ఞంలా జగనన్న సురక్ష

వరదయ్యపాళెం: ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఓ యజ్ఞంలా సాగినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు. బుధవారం వరదయ్యపాళెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ ఫలాలు పొందని అర్హులకు లబ్ధి చేకూర్చడమే కాకుండా, అవసరమైన వారికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించడం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాలు 97 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష సభలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 79,371 కుటుంబాల సర్వే నిర్వహించి 64,769 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేసినట్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న 97శాతం సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని, వారి ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాగిందని వెల్లడించారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆయా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

దిశా, ఏపీ పోలీసు యాప్స్‌పై అవగాహన అవసరం

తిరుపతి సిటీ : మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నంబర్లు, మొబైల్ యాప్స్‌పై ప్రతి విద్యార్థినికీ అవగాహన ఉండాలని పద్మావతి మహిళా వర్సిటీ అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ కోన ప్రభ తెలిపారు. బుధవారం స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజీలో విద్యార్థినులకు రక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 100, 112, 181, 139 నంబర్లు, ఏపీ పోలీస్ సేవా యాప్, దిశా యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఎస్వీయూలో జాబ్ మేళా రేపు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 4వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఆర్ జ్యువెలరీ, గంగోత్రి ట్రేడర్స్, అపోలో పార్మసీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొంటారని పేర్కొన్నారు. మార్కెటింగ్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్స్, హెల్పర్స్, ఫార్మసిస్ట్స్ వంటి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శుక్రవారం ఉదయం 10గంటలకు వర్సిటీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989810194 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దూర విద్య డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీ యూని వర్సిటీ దూరవిద్య కేంద్రం(డీడీఈ) పరిధిలో ఈ ఏడాది ఏప్రెల్‌లో నిర్వహించిన డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) తృతీయ సంవత్సరం ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగ నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు డీడీఈ వెబ్‌సైట్‌ను గాను www.manabadi.co.in వెబ్‌సైట్‌ను వీక్షించి ఫలితాలను తెలుసుకోవచ్చని సూచించారు.

ఇక పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

నగదు రూపంలో పన్నుల వసూళ్లకు గ్రామ పంచాయతీలు ఇకపై గుడ్‌బై చెప్పనున్నాయి. కేవలం డిజిటల్ చెల్లింపులు మాత్రమే అంగీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశించింది. దీంతో ఆగస్టు 15వ తేదీనుంచి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ మేరకు పంచాయతీల్లో నగదు చెల్లింపులకు పూర్తిగా స్వస్తి పలకనున్నారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికోసం ఆగస్టు 1వ తేదీ నుంచే అవగాహన కల్పించనున్నారు.

- ఆగస్టు 15 నుంచి అమల్లోకి
- అవినీతికి చెక్‌పెట్టేందుకే ప్రభుత్వ నిర్ణయం
- ఏటా ఇంటి పన్నులు రూ.31.35 కోట్లు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజిటల్ సేవల పోస్టర్

జిల్లా పంచాయతీ పన్నుల సమాచారం		
ఏటా ఇంటి పన్నులు	-	రూ.31.35 కోట్లు
ఇతర పన్నులు	-	రూ.9.06 కోట్లు
పంచాయతీల సంఖ్య	-	774
కుటుంబాల సంఖ్య	-	2,05,436
జనాభా	-	10,08,199
మహిళలు	-	5,06,350
పురుషులు	-	5,01699
ఇతరులు	-	150

తిరుపతి అర్బన్: జిల్లాలోని గ్రామ పంచాయితీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత మొత్తంలో చెల్లించాల్సిన రుసుముతో పాటు ఇంటి పన్నులు సైతం డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేసుకోవాలి. అంతే కాకుండా వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక పరికరాలను అన్ని పంచాయతీలకు సమకూర్చనున్నారు. పంచాయతీల్లో నిధుల వినియోగంలో పారదర్శకతకు వీలుగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

అవినీతికి ఇక అవకాశం లేదు

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులతోపాటు లైబ్రరీ పన్ను, స్టోర్స్ పన్ను, లైటింగ్ పన్ను, డ్రైనేజీ పన్నులు, నీటి పన్నులు, ఫైర్ పన్నులు ఏటా 2,05,436 కుటుంబాల నుంచి రూ.31,35,24,975 వసూలు చేయాల్సి ఉంది. అంతేకాకుండా వ్యాపారానికి చెందిన ఇతర పన్నులు ఏటా రూ.9,06,37,203 వసూలు చేయాలి. వీరంతా ఆగస్టు 15వ తేదీ నుంచి డిజిటల్ రూపంలోనే చెల్లించాలి. గతంలో పలువురు పంచాయతీ సిబ్బంది పన్నులు వసూలు చేసి సొంత అవసరాలకు వాడుకున్నారనే విమర్శలు వినిపించాయి. ఎప్పుడో జిల్లా అధికారులు తనిఖీలు చేసిన సమయంలో అవి బయటపడేవి. ఆ సమయంలో నీళ్లు నమిలేవారు. తప్పనిసరి పరిస్థితులలో రికవరీ చేసేవారు. తనిఖీలు చేయకుంటే జేబుల్లోకి వెళ్లిపోయేవి. అలాంటి పరిస్థితులకు తావులేకుండా ప్రభుత్వం నగదు వసూళ్లకు చెక్‌పెట్టింది. అంతా డిజిటల్ పద్ధతిలోనే నిర్వహించనుంది.

డిజిటల్ చెల్లింపులతో స్పష్టత



మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టనుంది. దీంతో పన్నుల విషయంలో స్పష్టత ఉంటుందని భావిస్తున్నాం. పంచాయితీ సిబ్బందికి నగదు ఇవ్వడం ద్వారా అక్రమాలకు అవకాశం ఉండేది. ఇకపై అలాంటి తలనొప్పులకు తావులేకుండా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించడం సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నాం. - మునికుమార్, పల్లం పంచాయతీ, ఏర్పేడు మండలం

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం



ఆగస్టు 15 తర్వాత ఏ ఒక్క పంచాయతీలోను నగదు తీసుకోరాదని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశాం. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో డిజిటల్ పేమెంట్ల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ ఖాతాలు ఉన్న బ్యాంక్‌ల నుంచి క్యూఆర్ కోడ్‌లను తీసుకుంటున్నారు. ముందుగా డిజిటల్ చెల్లింపులపై గ్రామాల్లో ఆగస్టు 1వ తేదీనుంచి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నాం. - రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, తిరుపతి

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి


సురేష్ మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పదోమైలు వద్ద కేటీ రోడ్డుపై మంగళవారం రాత్రి ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. తొట్టంబేడు మండలం అంజూరు గ్రామానికి చెందిన సురేష్ (34) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోవరదయ్యపాళెం మండలంలోని సీసీఎల్ ఫ్యాక్టరీకి అంజూరు నుంచి కూలీలను తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఉండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన సురేష్ అక్కడికక్కడే మరణించాడు. ఎస్‌ఐ మంజునాథరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

నారాయణవనం: మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న యువతి(20) మంగళవారం అదృశ్యమైంది. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలానికి చెందిన యువతి బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు వచ్చిన ఆమె తరగతికి హాజరు కాకపోవడంతో ఇంటికి సమాచారం ఇచ్చారు. సీసీ పుటేజీని పరిశీలించగా ఉదయం 9.45 గంటలకు యువతి ఆటోలో పుత్తూరు వైపు వెళ్లినట్లు గుర్తించారు. బంధువులు, స్నేహితులను విచారించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపులకు మరో అబల ఆహుతి


భర్త తిరుమలతో హేమావతి (ఫైల్)

పిచ్చాటూరు : తెలిసీ తెలియని వయసులో పెద్దలు పెళ్లి చేశారు. కోటి ఆశలతో అత్తవారింట అడుగు పెడితే ఆదరించాల్సిన భర్త నుంచి వేధింపులు ఎదురయ్యాయి. అండగా నిలవాల్సిన అత్తామామల నుంచి ఓదార్పు కరువైంది. చివరకు అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన మంగళవారం పిచ్చాటూరు మండల కీళపూడిలో తీవ్ర విషాదం నింపింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఏసురెడ్డి, పుష్ప దంపతుల కుమారుడు వి.తిరుమలకు తమిళనాడులోని రాణిపేట వద్ద సైనాపురానికి చెందిన కుమార్, గౌరీ దంపతుల కుమార్తె కె.హేమావతి(16)తో గత ఏడాది డిసెంబర్ 4వ తేదీన వివాహమైంది. ఆ సమయంలో వధువు తల్లిదండ్రులు కట్నంగా 10 సవర్ల బంగారం అందజేశారు. అయితే అత్తగారింటికి వచ్చినప్పటి నుంచి హేమావతిని ఆమె భర్త అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. మరో 10 సవర్ల బంగారం తీసుకురావాలని ఘర్షణ పడేవాడు. ఈ విషయం తెలుసుకున్న హేమావతి తల్లిదండ్రులు తమ బంధువులతో కలిసి రెండు నెలల క్రితం కీళపూడికి వచ్చి అల్లుడు తిరుమలకు నచ్చజెప్పారు. దీంతో తిరుమల వేధింపులను మరింత తీవ్రతరం చేశాడు. ఈ క్రమంలో హేమావతి మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఒంటికి అంటుకున్న మంటలతో కేకలు వేసింది. చుట్టుపక్కలవారు ఇంట్లోకి వెళ్లి మంటలు ఆర్పి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 1.45 గంటలకు మరణించింది. దీనిపై మృతురాలి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాధితురాలు మైనర్ అని, ఆమె భరత్త పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మహాలక్ష్మీ మహాయాగానికి శాస్త్రోక్తంగా కలశ స్థాపన

- వేడుకగా శ్రీమన్నారాయణస్వామి ఊరేగింపు


విశేషాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమన్నారాయణస్వామి

తిరుపతి కల్చరల్: లోకకల్యాణార్థం, మానవాళి సుభిక్షతను ఆకాంక్షిస్తూ శ్రీపురుషోత్తమ మాస్ మహోత్సవంలో భాగంగా గురువారం నుంచి 9వ తేదీ వరకు రాజస్థాన్ ఝులారియా పీఠాధిపతి ఘన్‌శ్యామాచార్య మహరాజ్ ఆధ్వర్యంలో డీబీఆర్ రోడ్డులోని ప్రత్యేక యాగ మండపంలో 225 కుండలాల శ్రీమహాలక్ష్మీ మహా యాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. అంతకుముందు శ్రీ కన్వెన్షన్ హాల్‌లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమన్నారాయణస్వామి ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి యాగ మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అక్కడ స్వామి, అమ్మవార్లకు వేద మంత్రోచ్ఛరణల నడుమ యజ్ఞ పవిత్ర ధారణ చేపట్టారు. శ్రీమహాలక్ష్మీ మహా యాగం ఆరంభం సందర్భంగా గురువారం ఉదయం 8 గంటలకు రామానుజ సర్కిల్‌లో జగద్గురు రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం వేలాది మంది భక్తుల భక్తి సంకీర్తనలు, భజనలతో శ్రీరామతులసీ కల్యాణ మండపం నుంచి డీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్ వద్దనున్న మహా యాగ మండపం వరకు శోభాయాత్ర చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో యజ్ఞ ప్రధాన ఆచార్య కైలాస్ చంద్ర స్వామిజీ, శ్రీమహాలక్ష్మీ మహాయాగం నిర్వాహణ కో ఆర్డినేటర్ కుప్పాల గిరిధర్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఎస్పీ అభినందనలు



తిరుపతి క్రైం: గత నెల 27వ తేదీన సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ గణిత ఒలంపియాడ్ ఛాలెంజ్ (ఎస్ఐఎంఓసీ) ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి అనిరుద్ శ్రీరామ్ రాజాను ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించారు. శ్రీరామ్‌రాజా బుధవారం తల్లిదండ్రులతో కలిసి ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 32 దేశాల విద్యార్థులతో పోటీపడి సత్తా చాటిన ఎనిమిదేళ్ల తెలుగు విద్యార్థి అనిరుద్ శ్రీరామ్ రాజా అందరికీ ఆదర్శమన్నారు.

క్రికెట్ టోర్నీలో చిత్తూరు, కర్నూలు జయకేతనం


5 వికెట్లు పడగొట్టిన కర్నూలు జట్టు క్రీడాకారిణి శరణ్య

వెంకటగిరి : పట్టణంలోని తారక రామా క్రీడాప్రాంగణంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు విజేతలుగా నిలిచాయి. బుధవారం తొలుత గ్రౌండ్–1లో నెల్లూరు– చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 24.3 ఓవర్లకు 3 వికెట్లు నష్టపోయి 147 పరుగులు చేసి గెలుపొందింది. గ్రౌండ్–2లో అనంతపురం– కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 36 ఓవర్లలో 99 పరుగుకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 20.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసి అలవోకగా విజయం సాధించింది.

యువకుడి ఆత్మహత్య


మణిమారన్ (ఫైల్)

పాకాల : మండలంలోని ముద్దలపల్లె సమీపంలో బుధవారం రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. పాకాలలోని ధర్మరాజులగుడివీధికి చెందిన మణిమారన్(24) కోయంబత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ట్రాన్స్‌ఫార్మర్‌లు వచ్చాయని ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ సుబ్బారావ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 40, 315 సామర్థ్యంతో 4, 63 కేవీ 21 వచ్చాయని వెల్లడించారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్‌లు పెట్టి మెటీరియల్‌ను డ్రా చేసుకోవాలని సూచించారు.

అప్పుడే నూరేళ్లు నిండాయా 'నవీనా'!


కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి చిట్టిబాబు


రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు (ఇన్‌సెట్) నవీన్ (ఫైల్)

- కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం
- మిన్నంటిన తండ్రి రోదన
- వడమాలపేట వద్ద ఘోరం

పుత్తూరు రూరల్: ఇంటికి వస్తువులు తీసుకొని ద్విచక్ర వాహనంపై బయల్దేరిన విద్యార్థిని కారు రూపంలో మృత్యువు కబళించింది. వడమాలపేట బైపాస్ రోడ్డులోని పాదిరేడు సర్కిల్ వద్ద బుధవారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు, వడమాలపేట మండలం పాదిరేడు ఎస్సీ కాలనీకి చెందిన తడుకు నవీన్(21) వడమాలపేట నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. చెన్నై నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఇనోవా కారు వేగంగా ఢీకొనడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని వ్యక్తులు భయపడి సంఘటనా స్థలంలోనే కారును వదిలిపెట్టి పరారయ్యారు. విషయం తెలుసుకొన్న నవీన్ తండ్రి చిట్టిబాబు సంఘటనా స్థలానికి చేరుకొని కొడుకు మృతదేహాన్ని చేతిలోకి తీసుకొని అప్పుడే నూరేళ్లు నిండాయా నవీనా అంటూ గుండెలవిసేలా రోదించారు. మృతుడు పుత్తూరు ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

ఆగ్రహించిన గ్రామస్తులు–ఆగిన వాహనాలు

పాదిరేడు బైపాస్‌గా పిలుస్తున్న సంఘటనా స్థలంలో ఎప్పటి నుంచో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మరో ఘోరం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. పాదిరేడు సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయిస్తామని సీఐ సురేష్‌కుమార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.39,550 నగదు, బైక్ స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి రూరల్: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి రూ.39,550 నగదు, మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సుబ్రమణ్యం రెడ్డి, ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తమిళనాడులోని నాగర్‌కోయిల్ జిల్లా కన్యాకుమారికి చెందిన ఉమేష్ ధీరజ్, అతడి తండ్రి ఉమేష్ పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. అందులో భాగంగా జూలై 11వ తేదీ అర్ధరాత్రి తిరుపతి రూరల్ మండలం కొత్త చెర్లోపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ చేసినట్లు చెప్పారు. హుండీని పగలకొట్టి రూ.57 వేల నగదు, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్స్‌ను అపహరించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బుధవారం కాలూరు క్రాస్ వద్ద ఉమేష్ ధీరజ్ పట్టుబడినట్లు వెల్లడించారు. మరో నిందితుడు ఉమేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ పరమేశ్వర రెడ్డి అభినందించారు.